ఎన్నికల పరిశీలకుడు రాజేశ్ మీనాకు మొక్కను అందజేస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

## ఎన్నికల పరిశీలకుడికి స్వాగతం

కామారెడ్డి, ఏప్రిల్ 28: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు రాజేశ్ మీనా ఆదివారం జిల్లా కేంద్రానికి వచ్చారు. ఆయనకు కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టిన ఎన్నికల ఏర్పాట్లతోపాటు చెక్‌పోస్టులు, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాల ద్వారా తనిఖీలు, పట్టుబడిన నగదు, మద్యం, నమోదు చేసిన కేసుల వివరాలను పరిశీలకుడికి కలెక్టర్ వివరించారు. వీటితోపాటు జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, పోలీసు బందోబస్తు, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, పౌరులు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకునేలా చేపడుతున్న చర్యలను తెలియజేశారు.

## ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించాలి

కామారెడ్డి, ఏప్రిల్ 28: ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం మే 24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు నోడల్ అధికారి షేక్ సలాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, రెండో సంవత్సరం పరీక్ష ఫీజును మే 2వ తేదీలోపు చెల్లించాలని సూచించారు. ఇంటర్ బోర్డు ఫస్టియర్, సెకండియర్‌కు రూ. 510 ఫీజు నిర్ధారించినట్లు తెలిపారు.

## చిత్తుబొత్తు ఆడుతున్న ఆరుగురి అరెస్టు

రాజంపేట్, ఏప్రిల్ 28: మండలంలోని తలమడ్ల గ్రామ శివారులో శనివారం రాత్రి చిత్తూబొత్తు ఆట స్థావరంపై జిల్లా స్పెషల్ టాస్క్ పోర్స్ దాడిచేసి ఆరుగురిని అరెస్టు చచేసింది. వారి నుంచి రూ. 6,060 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, ఆరు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్సై సంపత్ తెలిపారు. జూదం నేరమని, పేకాట తదితర జూదం ఆడుతున్నట్లు తెలిస్తే డయల్ 100 లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# కాంగ్రెస్‌కు ఓట్లడిగే అర్హత లేదు

- హామీలు నెరవేర్చని వారికి ఓటెందుకు వేయాలో ఆలోచించాలి
- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం
- జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌తో కలిసి ఎన్నికల ప్రచారం

గాలి అనిల్‌కుమార్‌తో కలిసి రోడ్‌షోలో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాసరెడ్డి, హాజరైన ప్రజలు

వర్ని, ఏప్రిల్ 27 : ఆరు గ్యారెంటీలను కేవలం వంద రోజుల్లో అమలుచేస్తామని హామీ ఇచ్చి.. అమలుచేయని కాంగ్రెస్ పార్టీకి ప్రజలను ఓట్లడిగే అర్హత లేదని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. వర్ని మండల కేంద్రంలో జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌తో కలిసి శనివారం రాత్రి రోడ్ షో ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. రైతులకు కనీసం సాగు నీరందించలేకపోతున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలన్నారు. కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు లక్ష రూపాయలతోపాటు తులం బంగారం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు, ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, రైతుబంధు ఇవ్వకుండా రైతులను అప్పులపాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. తనను భారీ మెజార్టీతో గెలిపించాలని, ప్రజలతో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, వర్ని జడ్పీటీసీ హరిదాస్, మండల కో-ఆప్షన్ సభ్యుడు కరీం, బీఆర్ఎస్ నాయకులు కల్లాలి గిరి, గోపాల్, సింగంపల్లి గంగారాం, రంజ్యానాయక్, పండరి, రాజు, శ్రీను, బాబు పాల్గొన్నారు.

నిర్మానుష్యంగా కనిపిస్తున్న ఎల్లారెడ్డిలోని ప్రధాన రహదారి

## మండుతున్న ఎండలు.. వెలవెలబోతున్న రోడ్లు..

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 28: పగటి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నాలుగైదు రోజులుగా వేడి పెరగడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం పది గంటలు దాటిందంటే చాలు ప్రజలు ఇంట్లో నుంచి బయటికి రావడానికి జంకుతున్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి ఎల్లారెడ్డి పట్టణానికి నిత్యం వందల సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. వేడి ఎక్కువగా ఉండడంతో వారి రాక తగ్గింది. దీంతో పట్టణంలో జన సంచారం కూడా తగ్గిపోయింది. జనాలు లేక రోడ్లు వెలవెలబోతున్నాయి. వారం రోజులుగా ఎల్లారెడ్డిలోని ప్రధాన రహదారులు జనాలు లేక కరోనా కాలాన్ని గుర్తుచేస్తున్నాయి. ప్రజలు ఎండలో బయటికి వెళ్లొద్దని, ముందు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

## ఫార్మాసిస్ట్ సంక్షేమ సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా దత్తురాం

మద్నూర్, ఏప్రిల్ 28: ఫార్మాసిస్ట్ సంక్షేమ సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా మండలకేంద్రానికి చెందిన తైదల్‌వార్ దత్తురామ్‌ను నియమించినట్లు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ ప్రకటించారు. ఈ సందర్భంగా దత్తురాం మాట్లాడుతూ.. ఫార్మాసిస్టులను పటిష్టం చేయడానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఫార్మసీ చట్టాల అమలు, హక్కుల సాధన కోసం పాటుపడుతానని తెలిపారు.

## విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఆజాద్

కామారెడ్డి, ఏప్రిల్ 28: రాబోయే విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకముందే కొన్ని సంస్థలు ముందస్తు అడ్మిషన్ల పేరిట భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, వీటిని అరికట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఆజాద్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అనుమతి లేకుండా అదనపు బ్రాంచీలను ఏర్పాటు చేసుకొని విద్యార్థుల వద్ద లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నాయని అన్నారు. దీనిపై విద్యాశాఖ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్, ఉపాధ్యక్షుడు సరిచంద్, జిల్లా నాయకులు నవీన్, సుశీల్, మహేశ్, రాందాస్, బాలాజీ, సచిన్ పాల్గొన్నారు.

## ఎన్‌సీసీ బెస్ట్ కేడెట్‌గా సాత్విక

సాత్వికకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎన్‌సీసీ అధికారి ప్రవీణ్ కుమార్

కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 28: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఈదుల సాత్విక ఎన్‌సీసీలో ఆల్‌రౌండ్ బెస్ట్ కేడెట్‌గా రెండోస్థానం సాధించినట్లు ప్రోగ్రాం అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గతనెలలో నిర్వహించిన ఫైరింగ్, డ్రిల్ మ్యాప్ రీడింగ్, రాత పరీక్షకు నిజామాబాద్ గ్రూప్‌లోని కామారెడ్డి, నిజామాబాద్, సంగారెడ్డి, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలనుంచి సుమారు రెండు వేల మంది హాజరయ్యారని, ఇందులో సాత్విక ఆల్‌రౌండ్ ప్రదర్శనతో రెండోస్థానంలో నిలిచి రూ.3500 క్యాష్ ప్రైజ్ సొంతం చేసుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆదివారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ప్రశంసాపత్రం, నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. అనంతరం హెచ్ఎం కారంగుల సాయిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు ఎన్‌సీసీలో ప్రతిభ కనబర్చడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి అబాకస్ పోటీలో ప్రతిభ

సాయిసంస్కృతిని అభినందిస్తున్న నిర్వాహకులు

మద్నూర్, ఏప్రిల్ 28: మండల కేంద్రానికి చెందిన సాయిసంస్కృతి జాతీయ స్థాయి అబాకస్ పోటీలో తృతీయ స్థానం సాధించిందని న్యూ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్ తెలిపారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన పరీక్షలో చిన్నారి ఉత్తమ ప్రతిభ చూపి మూడో స్థానంలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా సాయిసంస్కృతిని అబాకస్ ప్రతినిధులతోపాటు పాఠశాల యాజమాన్యం అభినందించింది.

## ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా చోరీ

ధర్పల్లి, ఏప్రిల్ 28 : ఇంట్లో అర్ధరాత్రి అందరూ నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై విక్రం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎన్టీఆర్ కాలనీలో శనివారం అర్ధరాత్రి కుటుంబసభ్యులు ఇంట్లో నిద్రిస్తుండగానే దుండగులు చొరబడి దొరికిన కాడికి దోచుకెళ్లారు. సెల్‌ఫోన్లు, 2 తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లారని బాధితులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును సన్మానిస్తున్న వడ్డెర కులస్తులు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 28: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును వడ్డెర ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ సభ్యులు ఎల్లారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానించారు. ట్రస్ట్ జిల్లా డైరెక్టర్ పిట్ల సురేశ్ తమ కులస్తుల సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించి, పరిష్కరించాలని కోరారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వడ్డెర యువజన సంఘం జిల్లా నాయకులు దయాకర్, పిట్ల శేఖర్ తదితరులు ఉన్నారు.

**గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ..**

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 28: నాగిరెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బైక్ ర్యాలీ నిర్వహిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆయన వెంట ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

మద్నూర్, ఏప్రిల్ 28: మండలంలోని అవల్‌గావ్ గ్రామంలో ఆదివారం అంబేద్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొని రాజ్యాంగ నిర్మాతకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ద్వారానే వెనుకబడిన వర్గాలు రిజర్వేషన్లు పొంది, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేసే కుట్రలను పన్నుతున్నదని ఆరోపించారు. ఓటు రూపంలో బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి

శ్రీనివాస్‌గౌడ్(ఫైల్)

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 28: తాడ్వాయి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌గౌడ్(50) శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విధులు నిర్వహించేందుకు కామారెడ్డి నుంచి తాడ్వాయి పోలీస్ స్టేషన్‌కు రాత్రి బయల్దేరిన శ్రీనివాస్‌గౌడ్ తాడ్వాయి శివారులోని కెనాల్ వద్ద ఆగి ఉన్న లారీని తన సాంత్రో కారుతో ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలు కాగా.. వెంటనే అతడిని 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మేడ్చల్ వద్ద మృతిచెందినట్లు ఆయన కుటుంబీకులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై సంజీవ్ తెలిపారు.

## కుళ్లిన మృతదేహం లభ్యం

గాంధారి, ఏప్రిల్ 28: మండల కేంద్రంలోని వాగుపై వంతెన సమీపంలో ఉన్న పాడుబడిన బావిలో కుళ్లిన యువతి మృతదేహం ఆదివారం లభ్యమైంది. బావిలో ఉన్న గోనె సంచిలో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న గాంధారి ఎస్సై ఆంజనేయులు తమ సిబ్బంది సహాయంతో బావిలో నుంచి గోనె సంచిని బయటికి తీయించారు. అందులో పూర్తిగా కుళ్లిన యువతి మృతదేహం ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు నెల రోజుల క్రితం ఆమెను హత్యచేసి గోనె సంచిలో వేసి బావిలో పడేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. యువతి వయస్సు 20 సంవత్సరాల వరకు ఉంటుందని, ఒంటిపై గులాబీ రంగు చీర ఉన్నదని ఎస్సై తెలిపారు. ఇటీవల అదృశ్యమైన గాంధారికి చెందిన కీర్తన(20)గా అనుమానం వ్యక్తంచేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై వివరించారు.

## కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

### ప్రమాద బీమా చెక్కు అందజేత

చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 28: తాడ్వాయి మండలంలోని క్రిష్ణాజివాడి గ్రామానికి చెందిన ఏనుగు రాజిరెడ్డి ప్రమాదవశాత్తు ఇటీవల మరణించాడు. అతడు బీఆర్ఎస్ సభ్యత్వం కలిగి ఉండడంతో పార్టీ తరఫున రూ.రెండు లక్షల బీమా మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కును ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ మృతుడి భార్య మంజులకు ఆదివారం అందజేశారు. ఆమెకు ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆయనతోపాటు మండల నాయకులు పాల్గొన్నారు.

## పోచమ్మకు బోనాల సమర్పణ

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 28: ఎల్లారెడ్డి బల్దియా పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో ముత్యాల పోచమ్మ, నల్లపోచమ్మకు ఆదివారం బోనాలను సమర్పించారు. ఆలయాన్ని శుద్ధి చేసి అందంగా అలంకరించారు. ప్రతి ఇంటి నుంచి బోనాలను తీసి దేవతలకు సమర్పించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొన్నది. గ్రామపెద్దలు, మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొత్తపల్లిలో బోనాలను తీసుకెళ్తున్న మహిళలు

ప్రవచిస్తున్న గురురాజ్ మహరాజ్

## భక్తితో మనసుకు ప్రశాంతత

### గురురాజ్ మహరాజ్

డోంగ్లీ, ఏప్రిల్ 28: భక్తితో మనసుకు ప్రశాంతత లభిస్తుందని గురురాజ్ మహరాజ్ దెగ్లూర్‌కర్ అన్నారు. మండలంలోని మొఘా గ్రామంలో అఖండ శివనామ సప్తాహం కొనసాగుతున్నది. చివరిరోజు ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మహరాజ్ పాల్గొని భక్తులకు ప్రవచనాలు చేశారు. గ్రామంలో తొమ్మిదేండ్లుగా సప్తాహం నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. ప్రజలు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో ప్రయాణించాలని సూచించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★SR ఆక్వా సొల్యూషన్స్, నిజామాబాద్ వాటర్ ప్యూరి ఫైయర్స్ నందు పనిచేయుటకు టెక్నిషియన్ (Male) కావలెను. Qual: ఇంటర్, జీతం + ఇన్సెంటివ్ సంప్ర॥ ✆ 98482 68883
NTZ-324910

CHANGE OF NAME

★I, DARAVASTHU ASHOK GANGADHAR (Old Name) I Have changed my name as DARAVASTHU ASHOK (New Name) S/o. Daravasthu Gangadhar Gaurayya, H.No. 2-56, Donkal, Morthad, Nizamabad 503 311
NTZ-324909

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 100/- మాత్రమే
GST వర్తించును
సెల్: 01827 77590

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899, 9640468899
NT-311840-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## బజరంగ్‌దళ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 28: ఎల్లారెడ్డి బల్దియా పరిధిలోని దేవునిపల్లి గ్రామ బజరంగ్‌దళ్ నూతన కార్యవర్గాన్ని శనివారంరాత్రి ఎన్నుకున్నారు. బజరంగ్‌దళ్ సంయోజక్‌గా అనిల్‌కుమార్, సహసంయోజక్‌గా కంచం రాజు, గోరక్ష ప్రముఖ్‌గా చిరంజీవి, సహ గోరక్షక్‌గా దుంపల దత్తు, బలోపాసన ప్రముఖ్‌గా బైండ్ల శ్రీనివాస్, విద్యార్థి ప్రముఖ్‌గా కొత్త దత్తు, సహ ప్రముఖ్‌గా దుంపల అరుణ్, సత్సంగ్ ప్రముఖ్‌గా సందీప్, విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడిగా నీల సిద్ధిరాములు, కార్యదర్శిగా కొత్త సందీప్‌ను ఎంపిక చేసినట్లు జిల్లా సహ సంయోజక్ వినోద్ కుమార్ తెలిపారు. గ్రామాల్లో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కమిటీలను ఏర్పాటుచేస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి బజరంగ్‌దళ్ సభ్యులు తులసీదాస్, భరత్, రాహుల్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు స్లిప్పుల పంపిణీ

గాంధారిలో ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

గాంధారి, ఏప్రిల్ 28: త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన ఓటరు స్లిప్పులను గాంధారితోపాటు పలు గ్రామాల్లో ఆదివారం పంపిణీ చేశారు. రెవెన్యూ, గ్రామ పంచాయతీ సిబ్బంది కలిసి ఇంటింటికీ తిరుగుతూ అర్హులకు ఓటరు స్లిప్పులను అందజేశారు. ఓటు చాలా విలువైందని, తప్పకుండా వినియోగించుకోవాలని వారు సూచించారు. ఓటు హక్కు ఉన్న వారందరికీ రెండు, మూడు రోజుల్లో స్లిప్పులను అందజేయడం పూర్తవుతుందని తెలిపారు.